


*(గత సంచిక తరువాయి)*

**మర్నాడు** హాస్పిటల్‌కి వెళ్ళిన త్రివిక్రం ఉదయపు రౌండ్స్ కోసం వార్డ్‌లోకి వెళ్ళాడు. రోగుల మంచాల దగ్గరకి వెళ్ళి, వాళ్ళ హెల్త్ ఛార్ట్‌లని పరీక్షించి కొందరికి అవే మందులని వాడమని చెప్పాడు. కొందరికి కొత్త మందులని రాసాడు.

మొహం, చేతులు కాలి బొబ్బలెక్కిన ఓ మహిళ ఆ రోజు కొత్తగా అడ్మిట్ అయింది. ఆమెని పరీక్షించాక అడిగాడు త్రివిక్రం.

"ఎలా జరిగిందిది?"

"మైక్రోవేవ్‌లో కాఫీకి నీళ్ళు పెట్టాను. టైమర్ ఆఫ్ అవగానే మూత తెరిచాను. అంతే. లోపల నించి వేడి నీళ్ళు బయటకి చిందాయి. కళ్ళకి చేతులు అడ్డుపెట్టుకున్నాను. లేదా కళ్ళల్లో అవి పడి కళ్ళుపోయి ఉందును." చెప్పిందా మహిళ.

"ఎందుకలా జరిగింది డాక్టర్? మా అమ్మాయి అనేకసార్లు మైక్రోవేవ్‌లో కాఫీకి నీళ్ళు కాచింది. ఎన్నడూ ఇలా జరగలేదు." అడిగింది ఆ అమ్మాయి తల్లి.

"పొయ్యి మీద మనం నీళ్ళు వేడిచేస్తే, బాయిలింగ్ పాయింట్‌కి రాగానే బుడగలు కిందనించి పైకి వస్తాయి. కానీ మైక్రోవేవ్ ఓవెన్‌లో ఏ ద్రవ పదార్థమైనా నీళ్ళు బాయిలింగ్ పాయింట్‌కి వచ్చాక ఒకోసారి బుడగలు వచ్చి నీళ్ళు కుతకుతలాడవు. ఎంత వేడి చేసినా అవి మామూలుగానే ఉంటాయి. గిన్నెని బయటకి తీసేప్పుడు నీళ్ళు కదిలినా లేదా తీసాక దాన్లో టీ బేగ్ కాని, స్పూన్ కానీ వేసినా అందులోని నీరు వెంటనే బయటకి చిందుతుంది. మైక్రోవేవ్ ఓవెన్‌ని ఉపయోగించేవారు దీన్ని తప్పనిసరిగా తెలుసుకుని ఉండాలి. లేదా కళ్ళు పోవచ్చు. లేదా ఒళ్ళు కాలి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సి సాధ్యమైనంత వరకూ నీళ్ళని స్టవ్ మీద కాయడమే బెటర్."

త్రివిక్రం ఇరవై ఏడో నెంబర్ బెడ్ దగ్గరకి వెళ్ళి, అది ఖాళీగా ఉండటం, ఆ రోగి వస్తువులు ఏమి అక్కడ లేకపోవడం చూసి కొద్దిగా నివ్వెరపోయాడు. ఆ బెడ్‌లో ఉండాల్సిన పిల్లవాడు ఋత్విక్ తండ్రి కనపడ్డాడు. బాగా ఏడ్చినట్లుగా ఆయన కళ్ళు ఉబ్బి ఉన్నాయి. "ఏమైంది?" అడిగాడు త్రివిక్రం.

"నిన్న రాత్రి ఋత్విక్ నిద్రలో పోయాడు."

"అరెరె! ఐయాం సో సారీ"

"ఇంకొన్నాళ్ళు ఉంటాడనుకున్నాం."

"బ్రెయిన్ ట్యూమర్ కేసుల్లో ఏదీ నిశ్చయంగా చెప్పలేం. మీ అబ్బాయి మంచి కవి. చిన్న వయసులోనే చాలా మంచి కవిత్వాలని రాసాడు."

"అవును. వాడు రాసుకున్న ఈ పుస్తకం వాడి జ్ఞాపకంగా మాకు మిగిలింది. వాడి ఆలోచనలు కవిత్వ రూపంలో ఎంత చక్కగా రాసాడు. వాడు పోవడానికి గంటలోపు ఏం రాసాడో చూడండి" ఋత్విక్ తండ్రి ఇచ్చిన పుస్తకాన్ని తీసుకుని త్రివిక్రం చదివాడు.

'ఆనందమా

లంగరెత్తు

తెడ్లు వేయి

ఆవలి తీరాని త్వరగా చేర్చు.‘

"చాలా అర్థవంతంగా ఉందిది" చదివి త్రివిక్రం చెప్పాడు.

"వాడికి ఎందుకో జరిగేది ముందే స్ఫురించిందని అనిపిస్తోంది" ఇంగ్లీష్‌లో రాసిన ఇంకో కవితని చూపించి చెప్పాడు ఋత్విక్ తండ్రి.

‘ప్రతీ ఉయ్యాల అడుగుతోంది.

ఎక్కడనించి?

ప్రతీ పాడె అడుగుతోంది.

ఎక్కడికి?‘

"నేనీ పుస్తకంలోని అన్ని కవితలని చదివాను. రాసింది రోజూ చూపించేవాడు. మా డాక్టర్ల మీద కూడా ఓ హాస్య కవితని రాసాడు. మీరు చదివే ఉంటారు."

ఆ పేజీని వెదికి ఆయనకి చూపించాడు త్రివిక్రం. ఆయన దాన్ని చదివి దిగులుగా నవ్వాడు.

‘నేనో డాక్టర్ దగ్గరకి వెళ్ళాను

ఆయన బ్రహ్మానందం అన్నలా ఉన్నాడు

నన్ను పరీక్షించి మందు రాసిచ్చాడు

వెలెటుడియం నిజం అని చదివాను

దానర్థం ఏమిటని అడిగాను

మరో మూడు మాటలు రాసిచ్చాడు

ఓ డిక్షనరీని కొను‘ అని. కొన్నాను.

డిక్షనరీలో ఆ పదం ఉంటే ఒట్టు‘

"నాకు బాగా నచ్చిన కవిత ఇది" ఋత్విక్ తన పుట్టిన రోజున రాసిన కవితని చూపించాడు త్రివిక్రం.

‘ఎయిట్ ఇయర్స్ ఎగో ఐ అరైవ్డ్ ఆన్ దిస్ డే

సో ఫార్ పర్ఫెక్ట్ ఇన్ జ్యబా ఎవ్విరి వే

ఆల్ దీస్ ఇయర్స్ హౌ ది టైమ్ డిడ్ ఫ్లై

‘క్రాలింగ్ టూవార్డ్స్ మై డెస్టినీ టు డై‘

"దీన్ని మీరు మీ అబ్బాయి జ్ఞాపకార్థం పుస్తకంగా ఎందుకు వేయకూడదు? చాలామంది ఎంజాయ్ చేసే నానీలు, గల్పికలు ఇందులో ఉన్నాయి." త్రివిక్రం సూచించాడు.

"మా ఆవిడకీ సరిగ్గా ఇదే ఆలోచన వచ్చింది. వీటిని తప్పక పుస్తకంగా వేస్తాను. మా వాడి మీద ఇక్కడి వైద్య సిబ్బంది అభిప్రాయాలు కూడా తీసుకుని పుస్తకంలో ముందు పేజీల్లో వేద్దామని మా ఆవిడ సూచించింది." ఋత్విక్ తండ్రి చెప్పాడు.

"ఎస్. అది బావుంటుంది. పాఠకులకి ఆ పిల్లవాడిని పరిచయం చేయడానికి అది చక్కటి పద్ధతి."

ఆయన ఆ పిల్లవాడి వస్తువులని ఓ సంచిలో వేసుకుంటూ చెప్పాడు.

"అప్పుడే అట్ట మీద బొమ్మ గురించి కూడా అనుకున్నాను. వాడిక్కడ మంచం మీద ఐ.వి ట్యూబ్‌లతో ఉన్న ఫోటో ఉంది. దాన్నే వేద్దామనుకుంటున్నాను."

ఆ పుస్తకం మీద తన ఆలోచనలని ఆయన ఆసక్తిగా వివరిస్తుంటే, ఆయన కళ్ళల్లో వెలుగు కనిపించింది.

"మీ ఋత్విక్ అనామకుడుగా పోయినా, వాడి కలమే వాడిని సజీవుడ్ని చేస్తుంది." ప్రోత్సాహ పూర్వకంగా చెప్పాడు త్రివిక్రం.

త్రివిక్రం విచారిస్తే బాలానగర్‌లో కొన్ని వందల పెద్ద, చిన్న ఫ్యాక్టరీలు ఉన్నాయని తెలిసింది. ఏ ఫ్యాక్టరీలో విశ్వేశ్వరావు పనిచేస్తున్నాడో తెలుసుకోవడం ఎలా? ఒక్కో ఫ్యాక్టరీకి వెళ్ళి వాకబు చేస్తూంటే చాలా కాలం పడుతుంది. శ్యామలరావుతో ఆ విషయం మీద చర్చించాడు. కానీ సృజన అనే భార్య గల విశ్వేశ్వరావు అనే వ్యక్తిని పట్టుకోవడం కష్టం అని ఊరుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

ఓ రోజు హాస్పిటల్ నించి ఇంటికి వెళుతూ ఓ సూపర్ బజార్‌లో ఆగి తండ్రికి గ్రేప్ జ్యూస్, బాదం పప్పు, తాజా పళ్ళని కొన్నాడు. అవి మెదడులోని జ్ఞాపకశక్తి నశించకుండా కాపాడే శక్తిగలవి అని శాస్త్ర పరిశోధనల్లో తేలింది. అది చదివాక త్రివిక్రం తన తండ్రి జ్ఞాపకశక్తి ఇంకాస్త నశించకుండా ఉండటానికి వాటిని క్రమం తప్పకుండా తండ్రికి ఇస్తున్నాడు.

"రాత్రికి అన్నం వద్దు. ఏదైనా లైట్‌గా టిఫిన్ తింటాను."

ఇంటికి చేరుకున్నాక సుందరేశ్వర్‌తో చెప్పాడు త్రివిక్రం.

"అలాగే"

ఆ రాత్రి సుందరేశ్వర్ కొద్దిగా పల్లీలని నూనెలో వేయించి, తిరగమోత వేసి అందులో మరమరాలు వేసి కొద్ది నిముషాలు వేయించాడు. దింపబోయే ముందు ఉప్పు, కారం, పుట్నాల పప్పుని వేసి కలిపి దింపాడు. అందులో కోసిన ఉల్లిపాయ, టమోటా ముక్కలు కలిపి, కొత్తిమీర తరిగి పైన చల్లి త్రివిక్రంకి ఇచ్చాడు.

దాన్ని తిని చెప్పాడు త్రివిక్రం.

"చాలా బావుందిది."

"రుచికి రుచి. కేలరీలు తక్కువ. కడుపు నిండినట్లుంటుంది. ఇలాంటిదే మరొకటి పంజాబీ మసాలా అప్పడం కాల్చి, దానిమీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, టమోటా ముక్కలు చల్లి తినడం." చెప్పాడు సుందరేశ్వర్.

"నాకు ఇంటర్నెట్ బ్రౌజింగ్ పని కొంత ఉంది. హ్యూస్టన్‌లోని రైస్ హాస్పిటల్‌లో కీ హోల్ ఆపరేషన్‌లో కొత్త టెక్నిక్ కనిపెట్టారని విన్నాను. దాన్ని గురించి సెర్చ్ చేసి చదవాలి. మా నాన్నగారికి మీరు డైరీ చదివి వినిపిస్తారా?" త్రివిక్రం.

"అలాగే. ఏదైనా ఆసక్తిగా ఉంటే మీకు చెప్తాను."

త్రివిక్రం గంట నలభై అయిదు నిముషాల సేపు ఆ బ్రౌజింగ్‌లో మునిగి పోయాడు. తర్వాత కంప్యూటర్‌ని ఆఫ్ చేసి తండ్రి గదిలోకి వెళ్ళాడు. సుందరేశ్వర్ లేడు. తండ్రి పడుకుని ఉన్నాడు. డైరీ ఎప్పటిలా మాములుగా కాక మధ్యకి మూసి ఉండటం చూసి దాన్ని తెరిచి ఆ పేజీ చూసాడు.

'టేప్ రికార్డర్‌లోని సౌండ్‌కి, సిడీలోని శబ్దానికి పెద్దగా తేడా ఏమీ లేదు. టేప్ రికార్డర్‌లోని సౌండే బావుందని అనిపించింది.'

ఆ రోజు ఆయన మొదటిసారిగా సిడిని విని ఉంటాడని అనుకున్నాడు.

దాని కింద తండ్రి చేతి రాతలో సుందరేశ్వర్ చెప్పిన మొక్కజొన్న గింజల గురించి తెలుగులో రాసి ఉంది దాని కింద ఇంగ్లీష్‌లో రాసి ఉంది.

'ఆల్ యువర్ ప్రయారిటీస్ ఛేంజ్ వెన్ యు బికమ్ ఏ ఫాదర్.'

'లియో టాల్‌స్టాయ్ ప్రయారిటీస్ ఛేంజ్ వెన్ యు బికమ్ ఏ ఫాదర్.'

'లియో టాల్‌స్టాయ్ తన భార్య తొమ్మిదో సంతానానికి జన్మని ఇచ్చిందని తెలిసాక ఇలా రాసుకున్నాడు. 'ఇది నాకు ఓ విధంగా రొటీనే అయినా, ప్రతీసారి నేను ఆనందంలో మునిగి మునకలేస్తున్నాను.'

ఆయన ఏ సందర్భంలో ఆ వాక్యాన్ని రాసాడో వివరం లేదు.

ఆయన మంచం ఎదురుగా వేలాడదీసిన తన తల్లి జనని ఫోటో వంక ఓసారి చూసాడు త్రివిక్రం. అది ఎవరిదో ఆయన గుర్తు పట్టచ్చన్న ఆశతో జననే దాన్ని అక్కడ వేలాడదీసింది.

'తను కన్న తల్లికాదని ఆవిడ తనకి ఎప్పుడూ ఎందుకు చెప్పలేదు?' అని ఎన్నో వందల సార్లు వేసుకున్న ఆ ప్రశ్ననే మళ్ళీ అతను వేసుకున్నాడు. ఎప్పటిలాగే అతనికి తృప్తికరమైన జవాబు స్ఫురించలేదు. బయటకి వచ్చి చప్పుడు కాకుండా ఆ గది తలుపు మూసి త్రివిక్రం తన గదిలోకి వెళ్ళాడు.

మళ్ళీ ఇంటర్‌నెట్‌లోకి వెళ్ళబుద్ధి పుట్టలేదు. డాక్టర్ విరజ ఇచ్చిన దత్తతకి వెళ్ళిన వారు తిరిగి తమ స్వంత తల్లితండ్రులని లేదా తమకి సంబంధించిన వాళ్ళని కలుసుకున్న నిజ జీవిత కథలున్న ఇంగ్లీష్ బుక్‌ని తెరిచాడు. అది చదువుతూ మధ్యలో నిద్రపోయాడు.

త్రివిక్రం కాకినాడలో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసే తన క్లాస్‌మేట్ దినాధిపతికి ఫోన్ చేసాడు. కొద్ది నెలల క్రితం అతని వివాహానికి కాకినాడ వెళ్ళి వచ్చాడు త్రివిక్రం. డాక్టర్లు అధికంగా ఉండే సాలిపేటలోని తన ఎడ్రస్ ఇచ్చాడు అతను.

"ఎలా ఉంది మేరిడ్ లైఫ్?" ఫోన్‌లో అడిగాడు.

"బావుంది. మా చుట్టాలమ్మాయే కదా" నవ్వాడతను.

"మీ జిల్లాలోని ఎదుర్లంకకి ఎలా వెళ్ళాలో తెలుసా?"

"రెండు రకాలుగా వెళ్ళొచ్చు. రావులపాలెంనించి దారి ఉంది. లేదా యానం వెళ్ళి పడవ మీద గోదావరి దాటితే ఎదుర్లంకే. ఏం?"

"పనుంది. యానాం మీకు ఎంత దూరం?"

అతనితో చర్చించాక కాకినాడ నించి యానాం మీదుగా ఎదుర్లంకకి వెళ్ళడం తేలికని నిశ్చయించుకున్నాడు. త్వరలో వస్తానని అతనికి చెప్పాడు.

## 7

ఏలూరు నించి తిరిగి వచ్చిన రెండు వారాల తర్వాత త్రివిక్రం ఓ శనివారం రాత్రి రైల్లో బయలుదేరి మర్నాడు ఉదయం కాకినాడకి చేరుకున్నాడు. రైలు దిగి సరాసరి సాలిపేటలోని తన మిత్రుడి ఇంటికి వెళ్ళాడు.

స్నానం చేసాక బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఆ మిత్రుడికి తన తల్లి మరణం గురించి, తన తల్లికి గర్భసంచి పుట్టుకతోనే లేకపోవడం గురించి, తన తల్లిదండ్రుల కోసం వెదికే తన ప్రయత్నం యావత్తూ వివరించాడు. అదంతా ఆశ్చర్యంగా విన్న ఆ మిత్రుడు చెప్పాడు.

"చిత్రంగా ఉందే. నా కారులో నిన్ను డ్రైవర్ యానాం దాకా తీసుకెళ్తాడు. నువ్వు యానాంకి భోజనం టైముకి వెళ్తావు. అక్కడ భోంచేసి గోదావరి దాటి ఎదుర్లంకలో ఎంక్వైరీ చేసుకుని మళ్ళీ పడవెక్కి వెనక్కిరా. నువ్వొచ్చేదాకా వాడు నది ఒడ్డునే వేచి ఉంటాడు. సరాసరి మళ్ళీ ఇక్కడికి రాత్రి భోజనం టైమ్‌కి వచ్చేయచ్చు."

ఆ ప్రకారం త్రివిక్రం వెంటనే బయలుదేరాడు. దాదాపు నాలుగు గంటల తర్వాత యానాం చేరుకున్నాడు.

దారిలో ఓ హోటల్‌లో డ్రైవరు, త్రివిక్రమ్ భోజనం చేసారు. గోదావరి ఒడ్డునే ఓ చర్చి పక్కన కారుని ఆపి డ్రైవర్ త్రివిక్రంని పడవ ఎక్కించాడు. ఇవతలి గట్టు నించే ఎదుర్లంక కనబడుతోంది. ఐదు నిముషాల్లో పడవలో అవతలి గట్టుకి చేరుకున్నాడు. పడవ దిగాక సన్నటి దారిలో నడిచి వెళ్తూంటే, కొందరు త్రివిక్రంని కొత్తవాడిగా గుర్తుపట్టి అడిగారు.

"ఎవరింటికి?"

"మీరు చెప్పగలరా? విశ్వేశ్వరరావు మామగారింటికి. అతని భార్య పేరు ప్రమీల. ఇప్పుడు లేదనుకుంటాను."

"మధుసూదనరావుగారింటికా? రండి చూపిస్తాను."

దారిలో ఆ మధ్య వయస్కుడు త్రివిక్రం గురించిన చాలా వివరాలని అడిగి తెలుసుకున్నాడు.

మధుసూదనరావు తోటకి వెళ్ళాడని తెలిసింది. భోజన కేరియర్ వెళ్ళింది కాబట్టి సాయంత్రానికి ఖానీ ఇంటికి తిరిగి రాడు. దాంతో దారి చూపిన అతనే మధుసూధనరావు ఇంట్లోని స్కూటర్ తీసుకుని దానిమీద త్రివిక్రంని నాలుగు కిలోమీటర్ల దూరంలోని తోటకి తీసుకెళ్ళాడు.

హైదరాబాద్ నించి తనతో ఏం పనిమీద అతను వచ్చాడో మధుసూదనరావుకి అర్థంకాలేదు. అదే ప్రశ్నని సూటిగా అడిగాడు.

"మీ అల్లుడు విశ్వేశ్వరరావుగారితో నాకు పని పడింది. ఆయన అడ్రస్ కోసం వచ్చాను." చెప్పాడు త్రివిక్రం.

"అతను పాడిన ఏదైనా చిట్‌ఫండ్ చీటికి గేరంటార్‌గా ఉన్నారా? లేదా మీకు అప్పు తీసుకుని బాకీ పడ్డాడా?" ఆయన అనుమానంగా అడిగాడు.

"అబ్బే. అలాంటిదేం లేదు. నా వ్యక్తిగత విషయంలో ఆయనకి తెలిసిన కొంత సమాచారం అడగడానికి. ఆయన భార్య ప్రమీల, నా తల్లి క్లాస్‌మేట్స్."

"మా అమ్మాయి ప్రమీల పోయాక నాకు అతనితో సంబంధం లేదు. ఇప్పుడు ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో నాకైతే తెలీదు. తెలిస్తే దయచేసి మీరు నాకు చెప్పండి. పిల్లపోయినంత మాత్రాన మా మధ్య బంధుత్వం పోదు కదా?"

"మీకు మీ అమ్మాయి ప్రమీల ఫ్రెండ్ జనని గుర్తుందా? ఆమె గురించిన వివరాలేమైనా తెలుసా?"

"తెలీదు."

ఆయన తన ఫోన్ నెంబరిచ్చి, త్రివిక్రం నెంబర్ రాసుకున్నాడు. ఆయన దగ్గర సెలవు తీసుకున్నాక, ఆ మధ్య వయస్కుడు మళ్ళీ త్రివిక్రంని పడవల రేవు దగ్గర స్కూటర్ మీద దింపాడు. గమ్యం చేరి, పడవ వచ్చే దాకా చెప్తూనే ఉన్నాడు.

"హైదరాబాద్ చాలాసార్లు వచ్చాను. కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డ్‌లో లక్ష్మీగణపతి స్టోర్స్ సందులో మా బావ ఉంటారు. ఆయన సేనిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ ఆయనకి ఆరెకరాల కొబ్బరితోటుంది. మా తోటతోపాటు ఆయనదీ చూస్తుంటాను. సఫిల్‌గూడాలో మా పిన్నమ్మ కొడుకు ఉన్నాడు. మినీ ట్యాంక్‌బండ్‌కి ఇవతలే. ఆడికో మూడెకరాల కొబ్బరితోటుంది.."

పడవ రాగానే యానాంకి చేరుకుని వేచి ఉన్న కారులో కాకినాడకి చేరుకున్నాడు. రాత్రి దినాధిపతి ఇంట్లో భోజనం చేసి సామర్లకోటకి అతని కారులోనే చేరుకున్నాడు. అక్కడ నించి హైదరాబాద్‌కి వెళ్ళే రైలెక్కాడు. ముందు అనుకున్నట్లుగానే సోమవారం ఉదయానికి మళ్ళీ హైదరాబాద్ చేరుకున్నాడు.

ఆదివారం ఉదయం బార్బర్ షాప్‌కి వచ్చాడు త్రివిక్రం. ఇద్దరు అప్పటికే వేచి ఉన్నారు. త్రివిక్రం ఓ కుర్చీలో కూర్చుని ఓ దినపత్రికని అందుకుని చదవసాగాడు. త్రివిక్రం దృష్టి ముందుగా ఆ దినపత్రికలోని ఫేమిలీ పేజీలో వెలువడ్డ ఆర్టికల్ తాలూకు కొన్ని

ఫోటోల మీద పడింది. మూడు దేవతామూర్తుల ఫోటోలవి. సరస్వతి, వినాయకుడు, ఆంజనేయస్వామి ఫోటోలు. వాటిని తను పూర్వం చూసినవని అతనికి గుర్తొచ్చింది. ఎక్కడ చూసాడో ఆలోచించాడు.

ఏలూరులోని అనేకమంది ఇళ్ళల్లో వాటిని తను చూసానని గుర్తుకు వచ్చింది. అంతేకాదు. వాటిని విశ్వేశ్వరావు రెండో భార్య సృజన సబ్బుబిళ్ళలతో చేసి ఇచ్చిందని వాళ్ళు చెప్పిన సంగతి కూడా గుర్తుకు వచ్చింది. వెంటనే ఆసక్తిగా ఆ ఆర్టికల్‌ని చదివాడు. చదువుతున్న కొద్దీ అతని మొహం వికసించసాగింది.

'ఆసక్తి, పట్టుదల ఉంటే ఏ వస్తువునైనా అద్భుత కళాఖండంగా తీర్చిదిద్దవచ్చు అనడానికి ఉదాహరణగా శ్రీమతి సృజన నిలుస్తుంది. తూర్పు గోదావరి జిల్లాకి చెందిన వీరు ఆలిండియా హేండీక్రాఫ్ట్స్‌లో ఉడ్ కార్వింగ్‌లో రెండేళ్ళ శిక్షణ పొందారు. తర్వాత చెక్కముక్కలని కళాఖండాలుగా తీర్చిదిద్దసాగారు. వివాహానంతరం కుటుంబంలో ఇల్లాలి పాత్రని నిర్వహిస్తూనే, నేర్చుకున్న కళని వృథాకానీకుండా తీరిక వేళల్లో సుబ్బు బిళ్ళలకి లక్ష్మి, గణపతి, సీతారామ, ఆంజనేయ, శివుడు, సరస్వతి, బుద్ధుడు, తదితర దేవతామూర్తులు, గాంధీ, శివాజి, సుభాష్ చంద్రబోస్ తదితర దేశభక్తుల రూపాలు ఇస్తున్నారు. ఆసక్తి గలవారికి వీరు నేర్పడమేకాక, వివిధ నగరాల్లో ఒన్‌మేన్ ఎగ్జిబిషన్‌లని కూడా నిర్వహించారు. వీటి అమ్మకాల మీద వచ్చిన లాభాలని శ్రీమతి సృజన మలకపేటలోని బ్లైండ్ స్కూల్‌కి ఇవ్వడం ముదావహం.

శ్రీమతి సృజన ఫోటోని అందులో వేసారు. ఆమె వయసు నలభై ఐదు - యాభై మధ్య ఉండచ్చు. ఆమె భర్త పేరు, కుటుంబ వివరాలు అందులో లేవు.

వెంటనే ఆ దినపత్రిక ఆఫీస్‌కి ఫోన్ చేసి ఫేమిలీ పేజీ ఎడిటర్ తో మాట్లాడాలని కోరాడు. అతను లైన్‌లోకి వచ్చాక చెప్పాదు.

"నమస్తే. నా పేరు త్రివిక్రం. నేను డాక్టర్ని. ఇవాళ మీ దిన పత్రికలో ఫేమిలీ పేజీలో 'సబ్బుబిళ్ళలతో కళాఖండాలు' అనే ఆర్టికల్ చదివాను. శ్రీమతి సృజన ఫోన్ నెంబర్ దయచేసి ఇవ్వగలరా?"

"సారీ అండి. కొత్తవాళ్ళకి ఎవరికీ ఫోన్ నెంబర్లు ఇవ్వకూడదు. దేనికి?"

"ఆ ఆర్ట్ గురించి మాట్లాడాలని" అబద్ధమాడాడు.

"మీ ఫోన్ నెంబర్ ఇవ్వండి. ఆమెకి ఇస్తాను. మీతో మాట్లాడాలనుకుంటే ఆమే మీకు ఫోన్ చేస్తారు."

"అలాగే" తన ఫోన్ నెంబర్ని ఇచ్చి థాంక్స్ చెప్పి పెట్టేసాడు.

సాయంత్రం ఐదు దాకా సృజన నించి ఫోన్ రాలేదు. ఫేమిలీ సెక్షన్ ఇన్‌ఛార్జ్ ఆమెకి తన గురించి చెప్పి నంబరు ఇచ్చాడో లేడో? ఇచ్చినా ఆమె ఫోన్ చేయదలచుకోలేదేమో? ఈ ఆలోచనలు రాగానే త్రివిక్రం సృజన చిరునామా తెలుసుకోడానికి ఇంకో మార్గం ఆమె తరచు డొనేట్ చేసే బ్లైండ్ స్కూల్‌కి వెళ్ళి ఆమె ఫోన్ నంబరు తీసుకోవడం అని ఆలోచించాడు.

త్రివిక్రం అక్కడికి వెళ్తూండగా సెల్‌ఫోన్ మోగింది. చూస్తే కొత్త నంబరు. ఆన్ చేసి చెప్పాడు.

"హలో! డాక్టర్ త్రివిక్రం హియర్."

"నా పేరు సృజన. మీ నంబర్ పేపర్ వాళ్ళు ఇచ్చారు. మీరు వాళ్ళకి ఫోన్ చేసి నా గురించి అడిగారట కదా?" ఓ ఆడకంఠం వినిపించింది.

"అవునండి."

"మీకు ఆ ఆర్ట్ నేర్చుకోవాలని ఉందా?"

"అది కాదు. నాకు మీతో వ్యక్తిగతమైన పని ఉంది. మీ భర్తగారి పేరు విశ్వేశ్వరరావు గారేనా? మీరు కొంతకాలం ఏలూరులో ఉండి వచ్చారు కదా?"

"అవును. నాతో మీకేం పని?" ఆవిడ కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది.

"మా అమ్మ, ప్రమీల క్లాస్‌మేట్స్. నేను మీ దగ్గరకి వచ్చినపుడు అన్ని వివరాలు చెప్తాను. మీ అడ్రస్ చెపితే, మీకు ఇప్పుడు పనేం లేకపోతే వెంటనే మీ దగ్గరకి వస్తాను."

"ఒన్ మినిట్."

ఆమె ఎవరికో తను చెప్పిన విషయాలని చెప్పడం అతనికి వినిపించింది. తర్వాత ఓ మగ కంఠం వినిపించింది.

"హలో? ఎవరు?"

"నా పేరు త్రివిక్రం. విశ్వేశ్వరావుగారేనా?"

"అవును. నా అడ్రస్ కోసం ఎదుర్లంకలోని మా మామగారు మధుసూదనరావుగారిని కలిసింది మీరేనన్నమాట?"

"అవును. అదేమిటి? ఆయనై మీ అడ్రస్ తెలీదని చెప్పారు?" ఆశ్చర్యపోయాడు త్రివిక్రం.

"ఎందుకో తెలీక భయపడి ఆయన మీతో అబద్ధం ఆడారు. మీరు జనని కొడుకని ఆయనకి చెప్పారటగా?"

"అవును."

"జనని, ప్రమీల మంచి ఫ్రెండ్స్."

"నేను మిమ్మల్ని ఇప్పుడు వచ్చి కలవచ్చా? ఆర్ యు ఫ్రీ?"

"రండి. రాత్రి ఎనిమిదికల్లా మా ఆవిడ క్లాసులు అయిపోతాయి. కొందరు వచ్చి స్కార్వింగ్ నేర్చుకుంటున్నారు" చెప్పాడు విశ్వేశ్వరరావు.

"మీరుండేది ఎక్కడ? మీ అడ్రస్ చెప్తారా?"

"మీకు భరత్ నగర్ తెలుసా?"

"తెలుసు. సనత్ నగర్ ఫ్లై ఓవర్‌కి ఎడం వైపు ఉండే కాలనీనే కదా?"

"అవును. ఆ కాలనీలోకి వచ్చాక."

నీళ్ళ టేంక్, టెంట్స్ అద్దెకి ఇచ్చే దుకాణం, ఎస్వీ టి.వి రిపేర్ షాపు, ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్. అతనింటికి ఎలా చేరుకోవాలో వివరాలు రాసుకున్నాడు త్రివిక్రం. ఇంకో గంటలో అక్కడ ఉంటానని చెప్పి కారుని వెనక్కి తిప్పాడు.

ప్రమీల బతికి లేకపోయినా విశ్వేశ్వరరావు తనకి సరైన సమాచారం ఇవ్వచ్చని త్రివిక్రం ఆశపడ్డాడు.

భరత్ నగర్ కాలనీకి చేరుకున్నాక, తను రాసుకున్న ఆధారాల ప్రకారం కారుని ఓ నల్ల గేటు ఇంటిముందు ఆపాడు. అందులోని మొదటి అంతస్థులోనే విశ్వేశ్వరరావు ఉండేది. దాని పిట్టగోడకి 'సృజన ఆర్ట్ స్కూల్' అనే చిన్న బోర్డు వేలాడుతోంది. కారు ఆపి లాక్ చేసి మెట్లెక్కి పైకి నడిచాడు.

"రండి. నేనే విశ్వేశ్వరరావుని."

త్రివిక్రం లోపలికి వెళ్ళగానే ముందు గదిలోని ఒకతను చేతిని చాపుతూ చెప్పాడు.

"డాక్టర్ త్రివిక్రం." ఆ చేతిని అందుకుని కరచాలనం చేస్తూ చెప్పాడు త్రివిక్రం.

విశేశ్వరరావు సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. ఆయన వయసుకి ఉండాల్సిన బరువుకన్నా తక్కువ బరువు ఉన్నాడని త్రివిక్రంకి అనిపించింది. ఇద్దరూ దిళ్ళు పరిచిన చెక్క సోఫాలో కూర్చున్నారు. ఆ గది వంక పరిశీలనగా చూస్తు మాట్లాడాడు త్రివిక్రం.

తను ఏలూరులో చూసినలాంటి అనేక దేవతా విగ్రహాల కళాఖండాలు అద్దాల షో కేస్‌ల్లో కనిపించాయి. కొన్ని పెద్దవి కూడా ఉన్నాయి. చెక్కతో చేసిన అనేక చిన్న, పెద్ద శిల్పాలు కూడా ఆ గదిలో చాలా ఉన్నాయి. కళాత్మకరూపంలో ఉన్న చెట్టు కాండాలు, బోదెలు కూడా నాలుగైదు ఉన్నాయి.

"మా అమ్మ జనని, మీ భార్య ప్రమీల మంచి ఫ్రెండ్స్ అని మా పిన్ని చెప్పింది. నేనో విషయం తెలుసుకోవాలని వచ్చాను."

"అదేమిటో నాకు తెలుసనుకుంటాను అయినా అడగండి." చెప్పాడు విశ్వేశ్వరరావు.

ఓ యాభై ఏళ్ళావిడ చేతిలో ట్రేతో ఆ గదిలోకి వచ్చింది. ఆవిడ సృజన అని ఫోటోని ముందే పేపర్లో చూడటం వల్ల గ్రహించాడు త్రివిక్రం. ఏభై ఏళ్ళ క్రితమే అంత మంచి పేరు పెట్టిన ఆవిడ తల్లితండ్రులని మనసులోనే అభినందించాడు. ఆ ట్రేలోని గ్లాస్‌లో ఎర్రరంగు ద్రవం ఉంది. 'థాంక్స్' చెప్పి అతనా గ్లాస్‌ని అందుకుంటూ చెప్పాడు.

"మీరు ఏలూరులో మీ ఫ్రెండ్‌కి ఇచ్చిన బొమ్మలని వాళ్ళు ముందు గదుల్లో చక్కగా అలంకరించుకున్నారు. మీ ఆర్ట్ చాలా గొప్పది."

"దానివల్లే అనుకుంటా మీరు నన్ను తేలిగ్గా కనుక్కోగలిగారు." నవ్వుతూ చెప్పింది సృజన.

అంతటి  సుతిమెత్తని కంఠం తన జీవితకాలంలో ఎన్నడూ త్రివిక్రం వినలేదు.

"మీ కంఠస్వరం చాలా బావుంది" అనాలోచితంగా చెప్పాడు.

"మా ఆవిడ తరచూ వినే పొగడ్త ఇది. పాటలు పాడటం మాత్రం రాదు." నవ్వుతూ చెప్పాడు విశ్వేశ్వరరావు.

సృజన లోపలికి వెళ్తూంటే అడిగాడు త్రివిక్రం.

"బావుంది. ఇదేం డ్రింక్?"

"కోకం" ఆగి చెప్పిందావిడ.

"కోకం? ఈ పేరు నేను ఎప్పుడూ వినలేదా?"

"ఈ పండు గోవాలో దొరుకుతుంది. మన ఆంధ్రాలో దొరకదు."

"ఓ! గోవా నించి దీన్ని తెప్పించారా?"

"అవును. మా చెల్లి వాళ్ళాయన అక్కడ టూరిస్ట్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను కొంకణ్. వాళ్ళది ప్రేమ పెళ్ళి. తనొచ్చినప్పుడల్లా కోకం జూస్ ఎసెన్స్ తెస్తూంటుంది."

సృజన లోపలికి వెళ్ళిపోయాక విశ్వేశ్వరరావు వైపు తిరిగి చెప్పాడు త్రివిక్రం.

"మీ గురించి తెలీక మిమ్మల్ని మా అమ్మ సెర్మనీకి ఆహ్వానించలేదు. మా అమ్మ నాలుగు నెలల క్రితం యాక్సిడెంట్లో పోయింది."

"ఓ! సారీ"

"పోస్ట్‌మార్టం రిపోర్ట్ ప్రకారం మా అమ్మకి పుట్టకతోనే గర్భసంచి లేదు. కాబట్టి నేనామె కొడుకుని కాను. నా తల్లి ఎవరో తెలుసుకోవాలని నేను ప్రయత్నిస్తున్నాను. మా పిన్నికి కానీ, మా బంధువుల్లో ఎవరికి కానీ ఈ రహస్యం తెలీదు మా అమ్మ ఫ్రెండ్స్‌కి తెలుసేమోనని వారందరినీ ట్రేస్ చేసి కలుస్తున్నాను. ప్రమీలగారు లేకపోయినా మీకు ఆ విషయాలేమైనా తెలిస్తే చెప్తారేమోనని మీ దగ్గరకి ఆశగా వచ్చాను."

"అది తెలుసుకోవడం తప్పనిసరా? దాన్ని కాలగర్భంలోనే దాక్కుని ఉండనివ్వచ్చుగా?" విశ్వేశ్వరరావు చిన్నగా నిట్టూర్చి అడిగాడు.

ఆ రహస్యం విశ్వేశ్వరరావుకి తెలియచ్చని అనిపించగానే మొదటిసారిగా త్రివిక్రంకి సంతోషం వేసింది.

"అంటే మీకు నా పుట్టుక రహస్యం మీకు తెలుసన్నమాట?"

"తెలుసు."

"నా తల్లి ఎవరు?"

"మా ఆవిడే"

ఈ లోగా ఆయన జేబులోని సెల్ ఫోన్ మోగింది. ఆయన దాన్ని ఆన్సర్ చేసాడు. తన జీవితానికి సంబంధించిన ముఖ్య సన్నివేశం గురించి మాట్లాడుతూ, ఆయన సెల్‌ని ఆన్సర్ చేయడం త్రివిక్రంకి చికాకనిపించింది. ఆయన కొత్తగా స్కార్వింగ్ క్లాసులో చేరాలనుకునే ఒకతని ప్రశ్నలకి జవాబులు ఇవ్వసాగాడు. తర్వాత తనింటికి ఎలా రావాలో వివరంగా సూచనలు ఇచ్చాడు.

ప్రమీల తన తల్లా? లేక సృజనా? మరి తన తండ్రి ఎవరు? ఈయనా? తనని తన తల్లి పెంపుడుకి తీసుకుందా? అన్నీ ప్రశ్నలే.

ఆయన ఫోన్‌లో మాట్లాడాక నవ్వుతూ చెప్పాడు. ఆ మాటల్లో గర్వం తొంగిచూసింది.

"ఆ ఇంటర్వ్యూ ప్రచురింపబడ్డాక ఇలా చాలా ఫోన్ వస్తున్నాయి. మా ఆవిడకి ఉన్న కళ హైదరాబాద్‌లో ఇంకెవరికీ లేదు."

"నాకు అర్థం కాలేదు. నా తల్లి మీ భార్య ప్రమీల అన్నారా ఇందాక?" అడిగాడు త్రివిక్రం.

"అవును. మా వివాహమైన ఐదేళ్ళకి నువ్వు ప్రమీల కడుపులో పడ్డావు."

"అంటే మీరు మా నాన్నగారా?"

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in